సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 19 । మార్చి । 2024



'అమ్మ' చల్లని చూపులో..
ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై దృష్టి సారించిన సర్కారు.. స్కూళ్ల నిర్వహణ బాధ్యతలను అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పగించింది. 8లో



రహదారుల దిగ్బంధం..
చర్ల మండల పూసుగుప్ప సమీపంలోని బీజాపూర్ జిల్లాలో ఎనిమిది కి.మీ. పొడవున రహదారులను మావోయిస్టులు దిగ్బంధించారు. 8లో

గరిష్టం/కనిష్టం
34°/22°

వాతావరణం
జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు కొంత తక్కువగానే నమోదవుతాయి. రాత్రి వేళ వాతావరణం చల్లగా ఉంటుంది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (మంగళవారం సా॥) 6.25
సహర్ (బుధవారం ఉ॥) 4.53


పాల్వంచ మండలం కిన్నెరసాని రిజర్వాయర్ మధ్యలోని ఆనంద ద్వీపం

వ్యవసాయం తర్వాత జిల్లాలో పారిశ్రామిక రంగమే ఉపాధికి పెద్ద దిక్కు. అయితే ఇటీవల ప్రకృతి పర్యాటకానికి పెద్దపీట వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు విధి విధానాలు, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో విస్తారమైన అడవులు, నదులు, కొండలు, జలపాతాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రకృతి పర్యాటక (ఎకో టూరిజం) రంగానికి అపారమైన అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనికి తోడు అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య నియమితులవడం మరో సానుకూల అంశం.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

ఎకో.. అవకాశాలెన్నో

జిల్లాలో ప్రకృతి పర్యాటకానికి పలు వనరులు
- కొత్తగూడెం మొదలు మణుగూరు వరకు చాన్స్
- ఎకో టూరిజంపై దృష్టి పెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఆహ్లాదంతో పాటు ఉపాధికీ అవకాశం

గేట్‌వేగా సెంట్రల్ పార్కు
జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో చలమల్ల శ్రీనివాస రావు సెంట్రల్ పార్కు ప్రకృతి పర్యాటకానికి అనువుగా ఉంది. వందకు పైగా ఎకరాల్లో విస్తరించిన ఈ పార్కు మినీ అడవికి నకలుగా ఉంది. ఇందులో నాలుగు కిలోమీటర్ల మేర వాకింగ్ ట్రాక్, యోగా పగోడాలు, బోటింగ్, ఓపెన్ జిమ్, ఎత్తయిన వాచింగ్ టవర్లు ఉన్నాయి. దీనికి తోడు అడ్వెంచర్ టూరిజానికి సంబంధించి రోప్ వాక్ సైతం గతంలో ఇక్కడ ఉండేది. ఈ పార్కుకు సమీపంలో హరిత కాకతీయ హోటల్, కన్వెన్షన్ సెంటర్లు నిర్మిస్తున్నారు. ఈ పార్కును మరింతగా అభివృద్ధి చేసి వసతి ఏర్పాట్లు కల్పిస్తే జిల్లాలో ఎకో టూరిజానికి గేట్ వేగా మారేందుకు ఆస్కారం ఉంది.

అందాలొలికే రథం గుట్టలు..
ఉమ్మడి వరంగల్ జిల్లాలో భద్రకాళి, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని భద్రాచలం టూరిజం సర్క్యూట్‌లను అనుసంధానం చేసేలా మణుగూరు మండలంలో రథం గుట్టలు ఉన్నాయి. గోదావరి నదికి ఆవల పర్ణశాల క్షేత్రం ఉండగా ఇవతల ఒడ్డున ఎత్తయిన రథం గుట్టలు ఉన్నాయి. ఈ గుట్టల నుంచి వానాకాలంలో వెన్నెల జలపాతం పై నుంచి కిందకు జాలువారుతుంది. అయితే ఇక్కడ టూరిజం పరంగా రోడ్డు వంటి కనీస ఏర్పాట్లు కూడా లేవు. రథం గుట్టల పైభాగంలో పది ఎకరాలకు పైగా సువిశాలమైన స్థలం అందుబాటులో ఉంది. పర్ణశాల, వెన్నెల జలపాతాలను లక్ష్యంగా చేసుకుని గోదావరి రివర్ వ్యూ కాటేజీలు కట్టేందుకు గత ప్రభుత్వంలో ప్రయత్నాలు జరిగాయి. కాటేజీలతో పాటు ట్రెక్కింగ్‌కు చోటు కల్పిస్తూ ఇక్కడ ప్రకృతి పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు అవకాశాలు ఉన్నాయి.

'పేట' చుట్టూ తోటలే..
అశ్వారావుపేట నియోజకవర్గంలో విస్తారంగా నర్సరీలు, పామాయిల్ తోటలు విస్తరించి ఉన్నాయి. పక్కనే గల ఏపీలో గుబ్బలమంగమ్మ ఆలయం ఉంది. ఈ అమ్మవారిని దర్శించుకునేందుకు సెలవు రోజుల్లో వేలాదిగా భక్తులు వస్తుంటారు. ఇక్కడ పర్యాటక పరంగా ఆశించిన స్థాయిలో ఏర్పాట్లు లేవు. గుబ్బల మంగమ్మ ఆలయానికి సమీపంలో తెలంగాణలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హరిత కాటేజీలు నిర్మిస్తే పర్యాటక రంగం పుంజుకునే అవకాశం ఉంది. తద్వారా పేటలో విస్తరించిన నర్సరీలకు మరింత ప్రాచుర్యం వస్తుంది.

పర్ణశాల – పాపికొండలు
జిల్లాలో అత్యధికంగా పర్యాటకులు/భక్తులు వచ్చే ప్రదేశంగా భద్రాచలానికి గుర్తింపు ఉంది. భద్రాచలం వచ్చిన భక్తుల్లో చాలా మంది పాపికొండలు, పర్ణశాలకు వెళ్తుంటారు. ప్రస్తుతం పర్ణశాలలో పర్యాటక రంగం పరంగా సౌకర్యాలు లేవు. గోదావరి తీరం వెంబడి రివర్ వ్యూ కాటేజీలు నిర్మిస్తే భక్తులు/పర్యాటకులకు ఉపయోగకరంగా ఉంటుంది. పోలవరం ప్రాజెక్టులో నీటిని రిజర్వ్ చేయడం ప్రారంభిస్తే పాపికొండల సందర్శనకు భద్రాచలం కీలకం అవుతుంది. దీనికి తగ్గట్టుగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో



భద్రాచలంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకునే వీలుంది. ఇదే సమయంలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు, ఆతిథ్య రంగంలో వ్యాపారాలు పుంజుకుంటాయి.

'ఆనందద్వీపం' పట్టాలెక్కేనా..?
గత మూడు దశాబ్దాలుగా జిల్లాలో ఎకో టూరిజానికి కిన్నెరసాని డ్యామ్, అక్కడున్న జింకల పార్కు కేరాఫ్ అడ్రస్‌గా ఉంది. సెలవు రోజుల్లో జింకల పార్కు, కిన్నెరసానిలో బోటింగ్ కోసం వందలాది మంది పర్యాటకులు వస్తున్నారు. ఇక్కడ వారు బస చేసేందుకు వీలుగా కాటేజీలు కూడా అందుబాటులో ఉన్నాయి. దీనికి అదనంగా శ్రీనగర్‌లోని దాల్ లేక్ తరహాలో బోట్ హౌజ్ టూరిజాన్ని అభివృద్ధి చేసేందుకు గతంలో ప్రయత్నాలు జరిగాయి. అలాగే విజయవాడ ప్రకాశం బ్యారేజీ దగ్గరున్న భవానీ ఐలాండ్ తరహాలో కిన్నెరసాని డ్యామ్ ఐలాండ్‌లో ఆనందవనం పేరుతో టూరిజాన్ని అభివృద్ధి చేసేందుకు గతంలో సర్వేలు చేపట్టారు. కానీ గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రతిపాదనలన్నీ బుట్టదాఖలయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వం ఎకో టూరిజానికి ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ఆనందద్వీపం ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు ప్రయత్నించాలని స్థానికులు కోరుతున్నారు.

'పది' పరీక్షలు ప్రారంభం


సింగరేణి ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

- తొలిరోజు 12,341 మందికి 12,286 విద్యార్థులు హాజరు
- కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ
- సెల్‌ఫోన్లకు అనుమతి నిరాకరణ


కొత్తగూడెంలోని ఓ కేంద్రంలో హాల్‌టికెట్లు తనిఖీ చేస్తున్న సిబ్బంది

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు అర్ధగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచనలు చేసిన నేపథ్యంలో జిల్లాలోని దాదాపు అన్ని కేంద్రాలకూ నిర్ణీత సమయానికి ముందే వచ్చారు. ఆయా కేంద్రాల వద్ద నిర్వాహకులు విద్యార్థులను క్షుణ్ణంగా పరీక్షించి లోపలికి పంపించారు. మాల్ ప్రాక్టీస్ జరుగకుండా పరీక్షల విధులు నిర్వహించే సిబ్బంది సెల్‌ఫోన్లను సైతం కేంద్రాల్లోకి అనుమతించలేదు. జిల్లాలో రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు 12,341 మంది ఉండగా 12,286 మంది పరీక్షకు హాజరయ్యారు. వివిధ కారణాలతో 55 మంది గైర్హాజరయ్యారు.

ఉన్నతాధికారుల తనిఖీలు..
జిల్లాలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాలను కలెక్టర్ ప్రియాంక ఆల సహా పలువురు ఉన్నతాధికారులు తనిఖీ చేశారు. కలెక్టర్ రెండు కేంద్రాలను, జిల్లా పరిశీలకులు పి.మదన్‌మోహన్ ఒక కేంద్రాన్ని, డీఈఓ వెంకటేశ్వరాచారి ఆరు సెంటర్లలో పరీక్ష తీరును పరిశీలించారు. జిల్లాలో ఏర్పాటుచేసిన 73 కేంద్రాల్లోనూ తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని, ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ తెలిపారు. చంద్రుగొండ మండలానికి చెందిన శివలింగరాజు అనే విద్యార్థి హాల్ టికెట్‌పై నమోదై ఉన్న పరీక్ష కేంద్రానికి వెళ్లకుండా బాబూక్యాంపు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లాడు. ఆ తర్వాత తనది ఆ సెంటర్ కాదని తెలుసుకుని ఆందోళన చెందుతుండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న చుంచుపల్లి ఎస్సై గడ్డం ప్రవీణ్‌కుమార్ తన వాహనంలో పాతకొత్తగూడెం ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు తీసుకెళ్లారు. అయితే ఆ సెంటర్ కూడా కాదని తెలియడంతో బూడిదగడ్డ ప్రభుత్వ పాఠశాలకు సకాలంలో తీసుకెళ్లడంతో నిర్వాహకులు కేంద్రంలోకి అనుమతించారు. అయితే కొత్తగూడెంలోని బూడిదగడ్డ ప్రభుత్వ పాఠశాలకు(పాతకొత్తగూడెం) అని, పాతకొత్తగూడెంలోని ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు (ఆనందఖని) పాఠశాల అని హాల్‌టికెట్లలో నమోదు కావడంతో విద్యార్థులు ఆయోమయానికి గురవుతున్నారు. ఇకనైనా ఆ రెండు సెంటర్ల పేర్లు మార్చాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

సరైన వసతులు కల్పించాలి..
పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో సరైన వసతులు కల్పించాలని కలెక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. కొత్తగూడెం సింగరేణి, సెయింట్ మెరీస్ హై స్కూళ్లలో పరీక్షలను ఆమె పరిశీలించారు. మాస్ కాపీయింగ్ జరగకుండా పర్యవేక్షించాలని ఇన్విజిలేటర్లకు సూచించారు. కాగా, రుద్రంపూర్‌లోని సెయింట్ జోసెఫ్ స్కూల్, సింగరేణి హైస్కూల్‌లో బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ రోహిత్ రాజ్ పరిశీలించారు. పరీక్షలు ముగిసేంతవరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారు ముత్తంగి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామి వారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. ముందుగా తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం గావించారు. అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

డీఆర్డీఓకు అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు

చుంచుపల్లి: జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఎం.విద్యాచందనకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ప్రియాంక ఆల సోమవారం ఆదేశాలు జారీ చేశారు. గతంలో డీఆర్డీఓగా పనిచేసిన మధుసూదన్ రాజు కూడా కొన్ని నెలల పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా వ్యవహరించిన విషయం తెలిసిందే.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ


లిఖితను అభినందిస్తున్న ఎస్ఈ, సిబ్బంది

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ రాష్ట్ర విద్యుత్ శాఖల ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి 14 వరకు యాదగిరిగుట్టలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు చెందిన విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ పి.లిఖిత విజేతగా నిలిచారు. 100 మీటర్ల పరుగులో ప్రథమ, లాంగ్‌జంప్‌లో ద్వితీయ, కరూమ్స్ ఓపెన్ డబుల్స్‌లో ద్వితీయ స్థానం సాధించారు. ఓవరాల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తృతీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఎస్ఈ కె. రమేష్, సిబ్బంది సోమవారం ఎస్ఈ కార్యాలయంలో లిఖితను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలతో జిల్లా విద్యుత్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని రమేష్ ఆకాంక్షించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.10కోట్లు


పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

పాల్వంచ: కేంద్రప్రభుత్వం బాలికల అభివృద్ధికి నిర్దేశించిన ప్రధానమంత్రి రాష్ట్రీయ ఉచ్చేతార్ శిక్ష అభియాన్ పథకం కింద పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.10కోట్ల నిధులు మంజూరయ్యాయని ప్రిన్సిపాల్ వై.చిన్నప్పయ్య తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 13 కళాశాలలు ఎంపిక కాగా, ఇందులో పాల్వంచ కూడా ఉందని వెల్లడించారు. ఈ నిధులతో కళాశాలలో అత్యాధునిక వసతులతో బాలికల హాస్టల్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కళాశాల 2024–25 విద్యాసంవత్సరం నుండి అటానమస్ హోదా కలిగి ఉండడంతో పాటు నాక్ 'ఏ' గ్రేడ్ సాధించిన నేపథ్యాన నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యా కమిషనర్ బుర్ర వెంకటేశం, కోఆర్డినేటర్ సౌందర్య జోషఫ్, రీజనల్ డైరెక్టర్ జి.యాదగిరి, జాయింట్ డైరెక్టర్ డీఎస్ఆర్.రాజేంద్రసింగ్, అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ బాలభాస్కర్‌కు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు 'రైతు నేస్తం'

సూపర్‌బజార్(కొత్తగూడెం): పంటల సాగులో రైతులకు మెళకువలపై అవగాహన కల్పించేందుకు 'రైతునేస్తం' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి బాబురావు తెలిపారు. జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి, ముత్యాలంపాడు క్రాస్ రోడ్, ములకలపల్లి, బూర్గంపాడు, చర్ల రైతువేదికల్లో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు జరిగే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు చేస్తారని పేర్కొన్నారు. వివిధ పంటల సాగులో మెళకువలను జగిత్యాల వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ బి.శ్రీనివాస్, కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త, డీన్ డాక్టర్ రాజశేఖర్, శాస్త్రవేత్త డాక్టర్ కె.కవిత వివరిస్తారని, ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని బాబురావు సూచించారు.

భక్తులకు ఇబ్బంది రానివ్వొద్దు

- లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలి
- శ్రీరామనవమి సమీక్షలో కలెక్టర్ ప్రియాంక ఆల



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): భద్రాచలంలో వచ్చే నెలలో జరిగే శ్రీరామనవమి, మహాపట్టాభిషేకం ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కల్యాణ వేడుక నిర్వహించే మిథిలా స్టేడియాన్ని 26 సెక్టార్లుగా విభజించాలని, సెక్టార్లలో కూర్చునే ప్రతీ భక్తుడు వేడుకను వీక్షించేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. భక్తులు ఒక సెక్టార్ నుంచి మరో సెక్టార్‌లోకి వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. లాడ్జీలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సౌకర్యం ఉందని, ఈ విషయాన్ని అందరూ గమనించాలని సూచించారు. మహోత్సవాల రోజుల్లో భద్రాచలం పట్టణంలో మద్యం, మాంసం విక్రయాలు నిలిపివేయాలని అధికారులను ఆదేశించారు. సెక్టార్లలో విధుల నిర్వహణకు ప్రత్యేక పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాలని డీపీఓకు సూచించారు. తాగునీటి సరఫరాకు పట్టణంలో 200 కుళాయిలు ఏర్పాటు చేయాలన్నారు. రెస్క్యూ టీమ్‌లను అందుబాటులో ఉంచాలని అగ్నిమాపక శాఖ అధికారులకు సూచించారు. భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. 24 గంటలూ పనిచేసేలా అత్యవసర వైద్య కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో అత్యసర వైద్య సేవలకు 20 పడకలను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. చిన్నారులు తప్పిపోయినా గుర్తించేందుకు వీలుగా చీటీపై సెల్ ఫోన్ నంబర్లు రాసి వారి జేబుల్లో పెట్టాలని తల్లిదండ్రులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, ఆలయ ఈఓ రమాదేవి, డీఆర్ఓ రవీంద్రనాథ్, ఆర్డీఓ మధు తదితరులు పాల్గొన్నారు.

మాకేవి పదవులు ?!

- నామినేటెడ్‌పై ఆశావహుల్లో నైరాశ్యం
- ఉమ్మడి జిల్లా కోటాలో తాజాగా ముగ్గురికి పదవులు
- రాష్ట్ర, జిల్లా స్థాయి పదవులకు ఇంకా పలువురి నిరీక్షణ
- రేసులో ముగ్గురు మంత్రుల అనుచరులు
- మిగతావి ఎన్నికల తర్వాతేనని నేతల బుజ్జగింపులు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవులు దక్కని వారిలో నైరాశ్యం నెలకొంది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌కు ముందురోజు రాష్ట్ర వ్యాప్తంగా 37 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించగా.. ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురికి అవకాశం దక్కింది. భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు రాష్ట్ర విద్యా సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా, రాయల నాగేశ్వరరావు గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా నియమితులయ్యారు. అలాగే వైరాకు చెందిన హైదరాబాద్‌లో నివాసముంటున్న మరో ఇద్దరికీ పదవులు దక్కాయి. ఇంతవరకూ బాగానే ఉన్నా.. రాష్ట్ర, జిల్లా స్థాయి నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారిలో అసంతృప్తి బయటపడుతోంది. మొదటి నుంచీ రేసులో ఉన్న తమకు తొలి జాబితాలో స్థానం దక్కలేదని నేతల వద్ద వాపోతుండగా.. లోక్‌సభ ఎన్నికల తర్వాత పదవులు వస్తాయని వారు బుజ్జగిస్తున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అనుచరులు ఎక్కువ మంది పదవులు ఆశిస్తున్న వారిలో ఉన్నారు.

పొంగులేటి శిబిరంలో ఎక్కువ..
మంత్రి పొంగులేటి అనుచరుల్లో ఉమ్మడి జిల్లా నుంచి ఎక్కువ మంది రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు ఆశించారు. గతంలో మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్‌గా బొర్రా రాజశేఖర్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా పిడమర్తి రవి బాధ్యతలు నిర్వర్తించగా.. ఇప్పటివరకైతే వీరికి చోటు దక్కలేదు. అలాగే ఐలూరి వెంకటేశ్వర్ రెడ్డి, జూపల్లి రమేష్, డాక్టర్ కోటా రాంబాబు, మద్దినేని బేబీ స్వర్ణకుమారి సైతం జాబితాలో ఉన్నారు. ఇంకా ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో జిల్లా స్థాయి నామినేటెడ్ పోస్టుల కోసం నేతలు పోటీ పడుతున్నారు. పొంగులేటి కోటాలో ఇప్పటికి మువ్వా విజయ్‌బాబుకు పదవి దక్కగా.. పాలేరు నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించి భంగపడిన రాయల నాగేశ్వరరావుకు పార్టీ కోటాలో పదవి వచ్చిందని నేతలు చర్చించుకుంటున్నారు.

భట్టి అనుచరుల్లో ఒకరికి..
డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క కోటాలో వైరా వాసి, హైదరాబాద్‌లో నివాసముంటున్న నాయుడు సత్యంకు రాష్ట్ర హస్తకళల చైర్మన్ పదవి దక్కింది. అయితే, భట్టి అనుచరులైన మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, భద్రాద్రి జిల్లాకు చెందిన నాగా సీతారాములుతో పాటు మరికొందరు నేతలు పదవులపై ఆశ పెట్టుకున్నారు. ఒకరికి రాష్ట్ర స్థాయి పదవి రావడంతో మిగిలిన వారెవరికైనా రాష్ట్ర స్థాయి పదవులు దక్కుతాయా.. లేక జిల్లా స్థాయి నామినేటెడ్ పదవులతో సరిపెడతారా అన్న చర్చ జరుగుతోంది.

తుమ్మల అనుచరుల ఎదురుచూపు..
మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుచరులైన మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, సాధు రమేష్‌రెడ్డి, కార్పొరేటర్ కమర్తపు మురళి, చావా నారాయణ, నల్లమల వెంకటేశ్వరరావు, శెట్టి రంగారావు తదితరులు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు ఆశించారు. ఇప్పటి వరకు పొంగులేటి, భట్టి కోటాలో కొందరికి నామినేటెడ్ పదవులు దక్కగా, మలి విడతలో తమలో ఒకరికైనా అవకాశం దక్కుతుందనే ఆశతో వారు ఉన్నట్లు తెలుస్తోంది.

మీకు తప్పనిసరి!
ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాల్లో ఎనిమిది కాంగ్రెస్ దక్కించుకోగా పొత్తులో భాగంగా కొత్తగూడెం స్థానం సీపీఐ ఖాతాలో చేరింది. మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్ గెలవడంతో రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టుల్లోనూ ఇక్కడి నేతలకు ప్రాధాన్యత ఇస్తారని ఆశావహుల్లో ధీమా వ్యక్తమైంది. రాష్ట్రంలోని 70 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించాల్సి ఉండగా, ఇంకా 25 కార్పొరేషన్లు మిగిలాయి. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఉమ్మడి జిల్లా నుంచి మరో ఇద్దరికి రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు దక్కే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. లేనిపక్షంలో జిల్లా స్థాయి పదవులైనా ఇప్పిస్తామని ఆశావహులను నేతలు బుజ్జగిస్తున్నట్లు సమాచారం. సామాజిక సమీకరణలు, పార్టీకి విధేయతను కూడా పరిగణనలోకి తీసుకొని పదవులు భర్తీ చేయాలని ఆశావహుల్లో అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గ్రేహౌండ్స్ ప్రత్యేక శిక్షణ ప్రారంభం


మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ రాజ్

కొత్తగూడెంరూరల్ : జిల్లా పోలీస్ సిబ్బందికి వారం రోజుల పాటు అందజేసే గ్రేహౌండ్స్ ప్రత్యేక శిక్షణను జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఎస్పీ రోహిత్ రాజ్ సోమవారం ప్రారంభించారు. శిక్షణకు 150 మంది పోలీసు అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ సిబ్బంది శారీరకంగా, మానసికంగా బలంగా ఉండడానికి ఈ శిక్షణ ఎంతగానో ఉపకరిస్తుందని అన్నారు. అంతేకాక శాంతి భద్రతల పరిరక్షణకు నిర్వహించాల్సిన బాధ్యతలు, మెళకువలను మెరుగుపరుచుకునే అవకాశం కలుగుతుందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చెక్‌పోస్టుల వద్ద, రహదారులపై వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేయాలన్నారు. శిక్షణలో ప్రతిభ కనబరచిన వారికి రివార్డులు అందజేస్తామని తెలిపారు. హాజరైన ప్రతీ ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.సాయి మనోహర్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్‌బాబు, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేలా ప్రతీ ఒక్కరు సహకరించాలని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఈనెల 16 నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల అవుతుండగా, ఆ రోజు నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 26న పరిశీలన ఉంటాయని తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణకు ఏప్రిల్ 29 వరకు గడువు ఉంటుందన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియ జరుగుతాయని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేసేందుకు 24 గంటలూ పనిచేసేలా 1950 నంబరుతో కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎన్నికల నియమాల అమలుకు 16 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 15 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లు, 18 వీడియో సర్వైలెన్స్ టీమ్‌లు, 30 ఎంసీసీ టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ 16 వరకు ఓటుహక్కు నమోదుకు అవకాశం ఉందని, అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జిల్లాలో స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రజలు, మీడియా ప్రతినిధులు సహకరించాలని కోరారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో 1,095 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం 9,84,629 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో పురుషులు 4,78,098 మంది, మహిళలు 5,06,471 మంది, ఇతరులు 60, ఎన్ఆర్ఐలు 53, సర్వీస్ ఓటర్లు 730 మంది ఉన్నారని తెలిపారు. 85 సంవత్సరాలు పైబడిన వారు 6,481 మందితో పాటు 14,021 మంది దివ్యాంగ ఓటర్లకు హోం పోస్టల్ బ్యాలెట్ అవకాశం ఉందని, అవసరమైన వారు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్పీ రోహిత్‌రాజ్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ప్రకారం రూ.50వేల కంటే ఎక్కువ నగదు వెంట తీసుకువెళ్తే సరైన పత్రాలు చూపించాలని, లేదంటే నగదును సీజ్ చేస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ పాల్గొన్నారు.

నోడల్ అధికారులదే కీలకపాత్ర
పార్లమెంట్ ఎన్నికల్లో నోడల్ అధికారులదే కీలకపాత్ర అని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఎన్నికలు విజయవంతం అయ్యేలా చూడాలని కోరారు. ఎన్నికల సందర్భంగా చేపడుతున్న చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను, నిర్వహించాల్సిన విధులపై అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

పోలీస్ వాహనంలో పరీక్షకు..

విద్యార్థిని సకాలంలో కేంద్రానికి చేర్చిన ఎస్‌ఐ



విద్యార్థిని పరీక్ష కేంద్రానికి తీసుకెళ్తున్న ఎస్సై

చుంచుపల్లి: చంద్రుగొండ మండలానికి చెందిన పదో తరగతి విద్యార్థి దూరపల్లి శివలింగ రాజు పరీక్ష రాసేందుకు సోమవారం బాబు క్యాంపు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రానికి వచ్చాడు. తాను చేరుకున్న పరీక్ష కేంద్రం సరైనది కాదని తెలిసి ఆందోళన చెందుతుండగా చుంచుపల్లి ఎస్సై గడ్డం ప్రవీణ్ కుమార్ గమనించారు. అప్పటికి పరీక్షకు ఇంకా ఐదు నిమిషాలే సమయం ఉండగా, ఎస్‌ఐ తన వాహనంలో స్వయంగా పాతకొత్తగూడెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లగా, విద్యార్థి సకాలంలో పరీక్షకు హాజరయ్యాడు. ఈ సందర్భంగా ఎస్‌ఐని పలువురు అభినందించారు.

స్కిల్ డెవలప్‌మెంట్ దరఖాస్తుకు గడువు పెంపు

మణుగూరు టౌన్: సింగరేణి కార్మికులు, మాజీ కార్మికుల కుటుంబాలు, పునరావాస ప్రాంతాలే కాక పరిసర గ్రామాల నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనుండగా, దరఖాస్తు గడువు పొడిగించారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెలాఖరు వరకు దరఖాస్తు చేసుకోవచ్చని డీజీఎం(పర్సనల్) ఎస్.రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యాన కాస్మోటాలజీ, డ్రోన్ టెక్నీషియన్, సోలార్ టెక్నీషియన్, సెల్ టెక్నీషియన్, మెకానిక్, ఆర్క్ అండ్ గ్యాస్ వెల్డింగ్ తదితర 38 కోర్సుల్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, పదో తరగతి అర్హత కలిగిన వారు ఈనెల 30వ తేదీలోగా www.scclmines. com/ apprenticeship వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుని ప్రతులను మణుగూరు వీటీసీ కార్యాలయంలో అందజేయాలని డీజీఎం సూచించారు.

ఆ బడిలో ముగ్గురే విద్యార్థులు!



ముగ్గురు విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు రాందాస్

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయ పోస్టులు ఉండగా, కేవలం ముగ్గురే విద్యార్థులు ఉన్నారు. మండలంలోని నారాయణపురం గ్రామపంచాయతీ పరిధి నెమలిపేట గ్రామంలో ఐటీడీఏ ప్రాథమిక పాఠశాల (జీపీఎస్)లో ముగ్గురు విద్యార్థులు ఉన్నారు. ఒకరు నాలుగు, మరో ఇద్దరు రెండో తరగతి చదువుతున్నారు. ఈ పాఠశాలకు రెండు టీచర్ పోస్టులు మంజూరుకాగా, విద్యార్థులు లేరని సురేష్ అనే ఉపాధ్యాయుడిని ఎస్‌ఈఆర్‌పీగా డిప్యూటేషన్‌పై పంపించారు. ప్రస్తుతం ఉపాధ్యాయుడు రాందాస్ ఇక్కడ విధులు నిర్వరిస్తున్నాడు.

ఇసుక అక్రమ రవాణాపై నిఘా



నెమలిపేట వాగు దగ్గర ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

అశ్వారావుపేటరూరల్: ఇసుక అక్రమార్కులను అడ్డుకునేందుకు ఓ వాగు దగ్గర నిఘా నేత్రాన్ని ఏర్పాటు చేశారు. అశ్వారావుపేట మండలం నారాయణపురం పంచాయతీ నెమలిపేట గ్రామ సమీపంలో ఉన్న పెదవాగు నుంచి కొన్నేళ్లుగా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. దీనిని నివారించేందుకు కలెక్టర్ ప్రియాంక ఆల ప్రత్యేక చొరవతో నెమలిపేట వాగు దగ్గర 360 డిగ్రీల సీసీ కెమెరాను ఏర్పాటు చేయించారు. సీసీ కెమెరా సౌరశక్తి సాయంతో పనిచేస్తుండగా, నేరుగా కలెక్టర్ కార్యాలయానికే అనుసంధానం చేశారు. వాగు దగ్గర సీసీ కెమెరాను జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఉన్నతాధికారులు ఏర్పాటు చేయించారని తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ తెలిపారు.

కార్మికుల కారు బోల్తా

త్రుటిలో తప్పిన ప్రమాదం



ఓసీ-4 చెక్ పోస్టు వద్ద బోల్తా పడ్డ కారు

మణుగూరు టౌన్: సింగరేణి విధులకు హాజరయ్యే కార్మికులు కారులో వస్తున్న క్రమంలో బోల్తా కొట్టిన సంఘటన మణుగూరులో సోమవారం చోటు చేసుకుంది. ఇటీవల కొత్తగూడెం నుంచి మణుగూరు ఏరియాలోని కేసీహెచ్‌పీ, కేపీయూజీ గనులకు బదిలీ అయిన ఎనిమిది మంది కార్మికులు ఇన్నోవా వాహనంలో విధులకు వస్తున్నారు. ఈ క్రమంలో సింగరేణి పరిధిలోని ఓసీ-4 చెక్‌పోస్టు మూలమలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. కార్మికులు ఎవరికీ గాయాలు కాకపోవడంతో సింగరేణి అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

‘అమ్మ’ చల్లని చూపులో..

ఆదర్శ కమిటీలకు పాఠశాలల బాధ్యత

- మహిళా సంఘాల సభ్యులతో కమిటీల ఏర్పాటు
- మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిర్ణయం
- ఉమ్మడి జిల్లాకు రూ.47.69 కోట్లు మంజూరు



మహిళా సంఘాల సభ్యుల సమావేశం(ఫైల్)

చుంచుపల్లి: కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ ప్రభుత్వ రంగ విద్యాసంస్థల బలోపేతంపై దృష్టి సారించింది. ఈ క్రమంలోనే ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాల ఆధ్వర్యంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను తాజాగా విడుదల చేయగా, ఉభయ జిల్లాల కలెక్టర్లు ఆర్‌డీఏ, విద్యాశాఖ, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో అమ్మ ఆదర్శ కమిటీల నిర్వహణ బాధ్యతలు, పాఠశాలలకు నిధుల కేటాయింపు, మౌలిక వసతుల కల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. దీంతో జిల్లా అధికారులు మహిళా సంఘాల సభ్యులతో ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. కాగా గతంలో ఉన్న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)ల స్థానంలో కొత్త ప్రభుత్వం ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేస్తోంది.

పాఠశాలలు తెరిచేలోగా..

అధికారులు గుర్తించిన పాఠశాలల్లో అత్యవసరమైన పనులను వచ్చే జూన్ 10 నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో యూడైస్ కింద గుర్తించిన 1,302 ప్రభుత్వ పాఠశాలలను పరిగణనలోకి తీసుకోనుండగా, ఖమ్మం జిల్లాలో 665 పాఠశాలలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 637 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఖమ్మంలో 578 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, 87 హైస్కూళ్లు, భద్రాద్రి జిల్లాలో 653 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, 44 హైస్కూళ్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటికి సంబంధించి డీఆర్‌డీఏ, విద్యాశాఖ అధికారులు అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు.

భద్రాద్రికి రూ.22.89 కోట్లు కేటాయింపు

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం రూ.47.69 కోట్లను మంజూరు చేసింది. ఇందులో భద్రాద్రి జిల్లాకు రూ. 22.89 కోట్లు, ఖమ్మం జిల్లాకు రూ.25 కోట్లను కేటాయించారు. ఇటీవల నియోజవర్గాల అభివృద్ధికి మంజూరు చేసిన రూ.10 కోట్ల నిధుల్లోంచి కూడా రూ.2 కోట్లను ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులకు ఖర్చు చేయనున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల ఏర్పాటైన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా కొత్త బ్యాంకు ఖాతాలను తెరుస్తున్నారు. ఇంజనీరింగ్ శాఖ అధికారులు ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో అత్యవసరమైన పనులను గుర్తించి అంచనాలు రూపొందిస్తున్నారు. కాగా ఈ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల పనితీరు మెరుగుడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

జిల్లాల వారీగా మహిళా సంఘాలు, పాఠశాలల వివరాలు

	భద్రాద్రి	ఖమ్మం
ప్రాథమిక పాఠశాలలు	766	813
ప్రాథమికోన్నత పాఠశాలలు	163	191
ఉన్నత పాఠశాలలు	109	202
గ్రామ సమాఖ్యలు	981	1,018
మొత్తం ఎస్‌హెచ్‌జీలు	18,197	25,051
మహిళా సభ్యులు	1,79,580	2,62,621

కమిటీ నిర్మాణం

గ్రామ/పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీకి చైర్మన్‌గా, ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థుల తల్లుల్లో ముగ్గురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకుంటారు. వారు స్థానిక మహిళా సంఘాల్లో సభ్యులై ఉండటంతోపాటు ఒకరు ఎస్సీ/ఎస్టీలై ఉండాలి.

నిధుల వినియోగం ఇలా..

పాఠశాలల నిర్వహణ పర్యవేక్షణ కోసం మూడు శాతం నిధులను సర్వీసు చార్జీల కింద కమిటీలకు కలెక్టర్ ద్వారా చెల్లిస్తారు. కమిటీ చైర్మన్, కన్వీనర్‌కు చెక్ పవర్ కల్పించడంతోపాటు వారి పేరుమీద ఉమ్మడిగా బ్యాంకు ఖాతా తెరవనున్నారు. ప్రభుత్వ పాఠశాల పరిధిలో చేపట్టే రూ.25 వేల వరకు అయ్యే పనులకు టెండర్ లేకుండానే ఖర్చు చేసే అవకాశముంది. అంతకంటే ఎక్కువ మొత్తంలో ఉంటే కమిటీల ద్వారా కలెక్టర్‌కు నివేదించాల్సి ఉంటుంది. కాగా, రూ.లక్ష దాటిన పనులను కలెక్టర్ల పర్యవేక్షణలో పరిశీలించి, హెచ్‌ఎం ధృవీకరించాకే చెల్లింపులు చేస్తారు. పాఠశాలల నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం కొత్తగా మహిళా సంఘాలకు అప్పగించడంతో ఏళ్లుగా పేరుకుపోయిన సమస్యలు పరిష్కారమవుతాయనే భావన వ్యక్తమవుతోంది.



చుంచుపల్లి ఉన్నత పాఠశాల

ఇవీ బాధ్యతలు

ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణం, గదుల మరమ్మతులు, పారిశుధ్యం, విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టడం, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ వంటి వాటిని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు నిర్వహిస్తాయి. ఇందుకోసం ఉపాధి హామీ పథకం ప్రత్యేక నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నీలకంఠేశ్వరాలయం ఆదాయం రూ.3.07లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

మణుగూరు టౌన్: పాత మణుగూరులోని కాకతీయుల కాలం నాటి నీలకంఠేశ్వర ఆలయం హుండీల్లో మహా శివరాత్రి సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. హుండీ ఆదాయంతో పాటు కల్యాణం, దర్శనం టికెట్లు, కొబ్బరికాయల వేలం కలిపి రూ.3,07,504 ఆదాయం నమోదైందని ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. హుండీ లెక్కింపును ఈఓ జి.సుదర్శన్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పోరిక బేల్ సింగ్, అర్చకులు రామచంద్రమూర్తి, ఆలయ వ్యవస్థాపకులు మల్లీడి లాలయ్య, గ్రామస్తులు కూడిపూడి బాబు, పర్స సత్యనారాయణ, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎవరికి వైకల్యం..?

- పరీక్షకు హాజరై తిరిగి వెళ్లిన ప్రత్యేక అవసరాలు కలిగిన పదో తరగతి విద్యార్థిని
- వైకల్యాన్ని నమోదు చేయని పాఠశాల యాజమాన్యం, విద్యాశాఖ

అశ్వారావుపేట: ప్రైవేటు పాఠశాల, విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంతో ప్రత్యేకావసరాలు కలిగిన ఓ బాలిక సోమవారం పదో తరగతి పరీక్ష రాయలేకపోయింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం... అశ్వారావుపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని అందరిలా నడుచుకోలేదు. ఆమె మానసిక పరిస్థితి సరిగా లేకపోయినా పాఠ్యాంశాలు చదువుతూ పరీక్షల వరకు వచ్చింది. పరీక్ష ఫీజు చెల్లించేటప్పుడు ఆమె వాడుతున్న మందులు, ఆమె లోపాన్ని తెలియజేస్తే ఉన్నతాధికారుల అనుమతితో వారికి ప్రత్యేక ప్రశ్నాపత్రాలుంటాయి. మిగిలిన వారిలా 6 సబ్జెక్టులకు 7 ప్రశ్నాపత్రాలకు పరీక్షలు రాయాల్సిన పని లేకుండా ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు సరళంగా 4 సబ్జెక్టులు మాత్రమే ఉంటాయి. వీరికి సహాయకుడిని ఏర్పాటు చేస్తారు. అలా దరఖాస్తు చేయకుండా సాధారణ విద్యార్థులకు మాదిరిగా దరఖాస్తు చేశారు. సోమవారం విద్యార్థిని పరీక్ష కేంద్రానికి చేరుకుంది. కేంద్రంలో 10 నిమిషాలకు మించి కూర్చోలేదని, అలా ఒకే చోట కూర్చుని ఉంటే కళ్లు తిరిగి వాంతులు అవుతాయని, ప్రవర్తనలో మార్పు రావచ్చని, బాలికను తీసుకొచ్చిన వ్యక్తి పరీక్ష కేంద్రం వద్ద అధికారులకు తెలిపాడు. దీంతో ఆమె పరిస్థితిని అర్థం చేసుకుని పరీక్షకు హాజరయ్యాక ఉన్నతాధికారుల అనుమతితో గంట తర్వాత విద్యార్థిని తరపు వ్యక్తి వాంగ్మూలంతో బయటకు పంపినట్లు సమాచారం.

ఇన్నాళ్లు ఏం చేసినట్లు..?

పాఠశాలలో బోధన చేస్తున్న ఉపాధ్యాయులకు, ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యానికి ఆమె పరిస్థితి ఇన్నాళ్లు తెలియదా..? కేవలం ఫీజు వసూలు కోసమే అడ్మిషన్ ఇచ్చారా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు విద్యాశాఖలో ఐఈఆర్‌పీ అనే ఓ ఉద్యోగి ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల వివరాలను ప్రభుత్వానికి తెలియపర్చాలిసి ఉంటుంది. ఆ విద్యార్థిని మండల కేంద్రంలోనే చదువుతున్నా వివరాలు విద్యాశాఖకు చేరకపోవడం విచారకరం. ఇక్కడ వైకల్యం చిన్నారికా? అవకాశం ఉన్నా సౌకర్యాలు కల్పించలేకపోయిన పాఠశాల యాజమాన్యం, విద్యాశాఖకా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

యూఆర్ఎస్‌లో విచారణ

- ఎస్ఓ మాకొద్దంటున్న సిబ్బంది, విద్యార్థులు
- అస్తవ్యస్తంగా అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల



ఎస్ఓను విచారిస్తున్న అధికారులు

కొత్తగూడెంఅర్బన్: వివిధ కారణాలతో చదువుకు దూరమైన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల(యూఆర్ఎస్) వివాదాలకు వేదికగా మారింది. దీంతో యూఆర్ఎస్ అవసరం లేదని జిల్లా విద్యాశాఖాధికారులు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు ఇటీవల నివేదించారు. పాత కొత్తగూడెం పాఠశాల పక్కన ఉన్న యూఆర్ఎస్‌లో స్పెషల్ ఆఫీసర్ ఇటీవల తొడపాశం పెట్టడం, గిచ్చడం వంటివి చేయడంతో విద్యార్థికి గాయాలయ్యాయి. దీంతో తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ఎస్ఓను నిలదీశారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి ఫిర్యాదు చేయగా, చైల్డ్‌వెల్ఫేర్, ఐసీడీఎస్, విద్యాశాఖాధికారులు యూఆర్ఎస్‌కు వచ్చి సోమవారం విచారణ జరిపారు. దీంతో ఎస్ఓ ఆగడాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఎస్ఓ ఇబ్బందులకు గురిచేస్తున్నారని యూఆర్ఎస్‌లో పని చేసే టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది వాపోతున్నారు. పలువురు నాన్ టీచింగ్ సిబ్బందిని విధుల నుంచి తొలగింపజేసినట్లు అధికారుల వద్ద మొరపెట్టుకున్నారు. హాజరు నమోదు, విద్యార్థుల సంఖ్యలో అవకతవకలు ఉన్నట్లు, మెనూ అమలు చేయడం లేదని, అన్నంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థులు చెప్పారు. ఎస్ఓపై విచారణ నివేదిక జిల్లా విద్యాశాఖాధిరికి ఏ విధంగా ఇస్తారో? తదుపరి ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. విద్యాశాఖ ఏఎంఓ నాగరాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను దిగ్బంధించిన మావోయిస్టులు

- భారీ వృక్షాలు నరికి రోడ్డుకు అడ్డంగా వేసిన వైనం
- కందకాలు తవ్వకం, బండరాళ్లతో పేర్చి రహదారులు మూసివేత
- భయంగుప్పిట్లో సరిహద్దు ఆదివాసీ గ్రామాలు



బీమారంపాడు-రాంపురం గ్రామాల మధ్యలో అడ్డంగా నరికి పడవేసిన చెట్లు



కొత్తపల్లి సమీపంలో రోడ్డుకు అడ్డంగా పేర్చిన బండరాళ్లు

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు అటవీ ప్రాంత గ్రామాల్లోని రోడ్లను దిగ్బంధనం చేశారు. చర్ల మండలం పూసుగుప్ప శివారు బీజాపూర్ జిల్లాలోని రాంపురం, బీమారంపాడు, కొత్తపల్లి గ్రామాల మధ్యలో సుమారు 8 కిలోమీటర్ల పొడవునా ఉన్న అటవీ మార్గంలోని రహదారులను మావోయిస్టులు దిగ్బంధించారు. భారీ వృక్షాలను నరికి రోడ్డుకు అడ్డంగా వేయడంతోపాటు రోడ్ల మధ్యలో భారీగా కందకాలను తవ్వారు. రాకపోకలు జరగకుండా పలు చోట్ల బండరాళ్లను రహదారులకు అడ్డంగా పేర్చారు. మావోయిస్టులు ఈ ఘటనలను ఎందుకు పాల్పడ్డారనేది తెలియడంలేదని సరిహద్దు అటవీ ప్రాంతాల గ్రామాల గిరిజనులు పేర్కొంటున్నారు. ఈ ఘటనలకు పాల్పడిన ప్రాంతాలకు సమీపంలో పూసుగుప్ప వద్ద పోలీసు క్యాంపు ఉండగా, ఇదే క్యాంపునకు సుమారు 6 కిలోమీటర్ల దూరంలోని బీమారంపాడు వద్ద మరో పోలీసు క్యాంపును ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. క్యాంపుల ఏర్పాటును వ్యతిరేకిస్తున్నామనే సంకేతాలను తెలియజేసేందుకే ఈ తరహా ఘటనలకు పాల్పడి ఉండవచ్చుననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రోడ్లను దిగ్బంధించడంవల్ల ఆయా గ్రామాల ఆదివాసీల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆదివాసీలు తీవ్రంగా భయాందోళనలు చెందుతున్నారు.

ఇద్దరిని హతమార్చిన మావోలు?

- ఇన్‌ఫార్మర్ల నెపంతో బీజాపూర్‌లో ఘటన!
- సరిహద్దు గ్రామాలకు వచ్చివెళ్లేవారిని ఆరా తీస్తున్న పోలీసులు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరిని మావోయిస్టులు హతమార్చినట్లు తెలుస్తోంది. చర్ల మండలం పూసుగుప్ప నుంచి సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న బీజాపూర్ జిల్లా రాంపురం – బీమారంపాడు మధ్య అటవీ ప్రాంతంలో మావోయిస్టులు రెండు రోజుల క్రితం ఈ ఘటనకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఇద్దరు వ్యక్తులను మావోయిస్టులు హత్య చేశారన్న ప్రచారంతో చర్ల నుంచి మీడియా బృందం వెళ్లగా ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. అయితే, కొత్తపల్లి నుంచి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న అటవీ ప్రాంతంలో దుర్వాసన వచ్చినా మృతదేహాల ఆచూకీ తెలియరాలేదు. కాగా, రాంపురం, బీమారంపాడు, కొత్తపల్లి తదితర గ్రామాల గిరిజనులు మాత్రం హత్య జరిగి ఉండొచ్చనే అనుమానం వ్యక్తం చేశారు. ఇంకొందరు గిరిజనులు.. కలప స్మగ్లర్లు బీజాపూర్ జిల్లాలోని అటవీ ప్రాంతానికి వెళ్లిన సందర్భంలో మావోయిస్టులు వారిని ఇన్‌ఫార్మర్ల నెపంతో హత్య చేసి ఉండొచ్చని చెబుతున్నారు. ట్రాక్టర్లతో స్మగ్లర్లు అటవీ ప్రాంతానికి వెళ్లగా ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్న మావోయిస్టులు వారిని హతమార్చి ట్రాక్టర్లను తీసుకెళ్లినట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. కాగా, ఇన్‌ఫార్మర్ల నెపంతో మావోలు ఇద్దరిని హతమార్చారనే ప్రచారంతో పోలీసులు సరిహద్దు గ్రామాలకు వచ్చివెళ్లే వారిని ఆరా తీస్తున్నారు.

యువకుడి మృతికి కారకులను అరెస్ట్ చేయాలి

పోలీస్‌స్టేషన్ ఎదుట బాధిత కుటుంబీకుల ఆందోళన



మృతుని కుటుంబసభ్యులు, బంధువులతో మాట్లాడుతున్న సీఐ అశోక్‌రెడ్డి

అశ్వాపురం: యువకుడి మృతికి కారకులను అరెస్ట్ చేయాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు సోమవారం పోలీస్ స్టేషన్ ఎదుట మణుగూరు –కొత్తగూడెం ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన యువకుడు అయిలపొంగు జగదీష్ మూడు రోజుల క్రితం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జగదీష్ ప్రేమ విఫలమై మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని, ఇందుకు కారకులైన ప్రియురాలు, ఆమె తల్లి, మరో వ్యక్తిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కేసు దర్యాప్తు జరుగుతోందని, నిందితులలను శిక్షస్తామని సీఐ అశోక్‌రెడ్డి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ ఘటనపై సీఐ అశోక్‌రెడ్డిని వివరణ కోరగా.. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, దర్యాప్తు అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ఇల్లెందు: ఇల్లెందులోని రౌడీషీటర్లకు డీఎస్పీ చంద్రభాను సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో పలువురు రౌడీ షీటర్లకు ఎన్నికల ప్రవర్తన నియమావళిని వివరించారు. అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్ప్రవర్తన కలిగి ఎన్నికలకు సహకరించాలని, ఎలాంటి ఘర్షణలకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సీఐ కరుణాకర్ ఉన్నారు.

బాల్య వివాహ ఘటనలో కేసు నమోదు

దమ్మపేట: బాల్య వివాహానికి కారకులైన వ్యక్తులపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని పెద్దగొల్లగూడెం గ్రామానికి చెందిన ఓ యువకుడు, అదే గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికను ఈ నెల 15న వివాహం చేసుకున్నాడు. ఈ వివాహానికి బాలిక తల్లితండ్రులు, వరుడి తల్లిదండ్రులు సహకరించారు. విషయం తెలుసుకున్న చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ వందేటి జ్యోతి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

పోక్సో కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: బాలికను ప్రేమపేరుతో వేధిస్తున్న ఓ యువకుడిపై సోమవారం పోలీసులు పోక్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ బాలిక(17)ను అదే ప్రాంతానికి చెందిన యువకుడు ఏడాది కాలంగా తాను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి కూడా సదరు మైనర్ బాలిక ఇంటికి వెళ్లి వేధించాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అదుపు తప్పిన స్కూల్ బస్సు



ప్రమాదానికి గురైన స్కూల్ బస్

అన్నపురెడ్డిపల్లి: స్కూల్ బస్సు అదుపు తప్పిన సంఘటన సోమవారం జరిగింది. గ్రామస్తులు, విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లి కేపీఆర్ గౌతం మోడల్ స్కూల్ బస్సు విద్యార్థులను పాఠశాలకు తీసుకెళ్లే క్రమంలో ఎర్రగుంట సమీపంలోని టీడీ బంజర్ వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపు తప్పింది. జాతీయ రహదారిపై ఉన్న డివైడర్ గ్రిల్స్‌ను ఢీకొట్టి రోడ్డు అవతలి వైపునకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు.

నాటుసారా స్వాధీనం

దుమ్ముగూడెం : నాటుసారాను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. సుజ్ఞానపురం గ్రామానికి అజ్మీరా రవి 60 లీటర్ల నాటుసారా తీసుకుని ఆర్లగూడెం మార్గంలో వెళ్తుండగా పెట్రోలింగ్‌కు వెళ్లిన సిబ్బంది గమనించి పట్టుకున్నారు. సారా స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కేశవరావు తెలిపారు.

కోడి పందేల స్థావరంపై దాడి

దమ్మపేట: మండల పరిధిలోని కొడిసెలగూడెం గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా ఎనిమిది మంది వ్యక్తులు పారిపోయారు. పది బైక్‌లు, నాలుగు కోడిపుంజులు, రూ.2,980 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బూర్గంపాడు: సారపాకలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం రాత్రి సారపాకలోని ఓ పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ దాడుల్లో ఓ పోలీస్ కానిస్టేబుల్‌తోపాటు నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.22వేల నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుమన్ తెలిపారు.